సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



కనకదుర్గమ్మకు వెండి వస్తువులు

అయినవిల్లి: దూనబోయినవారిపాలెంలో కనకదుర్గమ్మకు స్థానికులు కరుటూరి వీర వెంకట విశ్వేశ్వరరావు రూ.3 లక్షల విలువైన వెండి వస్తువులు సమర్పించారు.



ఇంటర్ పరీక్ష ఫీజుకు వేళాయె

వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి తొలి అడుగు పడింది. పరీక్ష ఫీజు చెల్లింపునకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది.

II లో

కడలిలోకి 4.36 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 4,36,392 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.30 అడుగుల నీటిమట్టం నమోదైంది.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా స్థాయి నేతల సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.00 గంటలకు రాష్ట్ర, జిల్లాస్థాయి, అనుబంధ విభాగాలలో పదవులు పొందిన నేతలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. పదవులలో ఉన్న నేతలందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి విద్యుత్ ఉద్యోగుల నిరసన ర్యాలీ



మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన కోర్కెల సాధనకు దశల వారీ పోరాటం సాగిస్తున్నామని, కోర్కెలు సాధించే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ వీవీఎస్ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర డిస్కం ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు దశలవారీ ఆందోళనలో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం నుంచి కోటిపల్లి బస్ స్టాండ్, ఆల్కాట్ గార్డెన్స్, బాలాజీపేట మీదుగా కలెక్టరేట్ వరకూ మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్‌ను కలిసి విద్యుత్ ఉద్యోగుల సమస్యలు సానుకూలంగా పరిష్కరించాలంటూ విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి కొ. చైర్మన్ రామారెడ్డి, డివిజన్ చైర్మన్ ఎం.శ్రీనివాస్, కన్వీనర్ కె.శ్రీనివాస్, రాజమహేంద్రవరం సర్కిల్‌లో ఉన్న అన్ని డివిజన్ల యూనియన్లు, అసోసియేషన్ల నుంచి ఉద్యోగులు పాల్గొన్నారు.

వీఆర్ఏల ధర్నా

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వీఆర్ఏలకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయం వద్ద తూర్పుగోదావరి జిల్లా వీఆర్ఏలు సోమవారం ధర్నా చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు మల్లిమొగ్గల వెంకటరమణ మాట్లాడుతూ వీఆర్ఏల ప్రధాన సమస్యల్లో ఒకటైన పే స్కేల్ అమలు చేయాలని అన్నారు. నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. కారుణ్య నియామకాల సమస్యలు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్నాయని, కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్‌లకు, ఆర్డీఓలకు వినతి పత్రం అందజేశామని, తమ సమస్యలకు పరిష్కారం చూపించలేదని అందుకే కలెక్టర్‌కి వినతి పత్రం అందచేశామన్నారు. తమ న్యాయమైన డిమాండ్‌లను తీర్చకపోగా మా పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన చెందారు. కలెక్టర్ కూడా తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధపడతామన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ ప్రెసిడెంట్ కె.రాజేంద్రప్రసాద్, కొవ్వూరు డివిజనల్ అధ్యక్షుడు దాసరి నాగరాజు పాల్గొన్నారు.

సమ్మెకు సన్నద్ధమైన పీహెచ్‌సీ వైద్యులు

- కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌ఓలకు డిమాండ్లతో వినతిపత్రం
- 25న కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడి

రాజమహేంద్రవరం రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యులు సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ తరపున కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావులకు సమ్మె పైన, డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏపి ప్రైమరీ హెల్త్‌సెంటర్స్ డాక్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డా.మౌనిక, వైద్యులు మాట్లాడారు. ఇన్-సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరణ, టైమ్-బౌండ్ ప్రమోషన్ల అమలు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం, ట్రైబల్ అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ.5,000 అలవెన్స్, నేటివిటీ - అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యల పరిష్కారం తమ ప్రధాన డిమాండ్లన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లు ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు పరిష్కారం కాలేదన్నారు. దీంతో నిరసనకు దిగక తప్పని పరిస్థితి ఏర్పడింది అని తెలిపారు. మా నిరసన ప్రజలపై కాదని ప్రభుత్వ నిర్లక్ష్యంపై మాత్రమే అని గమనించాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 25వతేదీన సమ్మె కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. వైద్య సేవల్లో అంతరాయం కలగడంపై పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అవుతుందన్నారు.

● శుభకారిణి.. సుమశోభిని

తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి శంకర్ జ్యోతి వెలిగించి కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభించారు. ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సుమారు 50 మంది భక్తులు కోటసత్తెమ్మ దీక్ష చేపట్టారు. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు.

- నిడదవోలు రూరల్



ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

● జై జై దుర్గాభవాని

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లావ్యాప్తంగా అమ్మవారి దేవాలయాల్లో శరన్నవరాత్రుల సందడి ప్రారంభమైంది. సోమవారం ఉదయం నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులు సమర్పించారు. అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గోదావరి తీరం భవానీ మాలధారణ భక్తులతో నిండిపోయింది. చిన్నపిల్లలు, పెద్దవారు, మహిళలు తొమ్మిది రోజుల మాలధారణ కార్యక్రమాన్ని పుష్కరఘాట్ వద్ద చేపట్టారు. ఎర్రని వస్త్రాలతో ఆ ప్రాంతం అంతా నిండిపోయింది.

స్వర్ణ కవచాలంకృత శ్రీదుర్గాదేవిగా అలంకరణ

స్థానిక దేవీచౌక్‌లోని శ్రీబాలా త్రిపుర సుందరి దేవీ అమ్మవారిని సోమవారం స్వర్ణ కవచాలంకృత శ్రీదుర్గాదేవిగా అలంకరించారు. రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారిని స్వర్ణ కవచాలంకృత శ్రీదేవిగా అలంకరించారు. పూర్వం మాధవవర్మ అనే మహారాజు ధర్మనిరతికి మెచ్చి అమ్మవారు విజయవాటికాపురిలో కనక వర్షం కురిపించారు. అప్పటి నుంచి అమ్మవారిని దసరా మహోత్సవాలలో తొలి రోజున స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అలంకరిస్తున్నారు. అమ్మవారి దర్శనంతో ఐశ్వర్యప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం.



సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో విద్యుత్ కాంతులతో బాలాత్రిపుర సుందరి దేవీ ఆలయం



స్వర్ణ కవచ కనకదుర్గా దేవి అలంకరణలో రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని శ్రీబాలా త్రిపుర సుందరి దేవీ

సర్వేయర్ లేని సర్వే..!

- సచివాలయ ఉద్యోగులతో తూతూ మంత్రంగా స్వామిత్వ' సర్వే నిర్వహణ
- కూటమి ప్రభుత్వంలో వింతలు చూసి ముక్కున వేలేసుకుంటున్న జనం
- భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురవుతాయో? అన్న మీమాంస

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టినప్పటి నుంచి వింతలకు అంతే లేకుండా పోతోంది. సాఫీగా నడుస్తున్న వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోంది. గత ప్రభుత్వంలో ఆవిష్కరించిన వాటిపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. ఇందులో భాగమే సచివాలయ వ్యవస్థ. గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు జాబ్‌చార్ట్‌కు సంబంధం లేని పనులకు కేటాయిస్తూ మానసిక క్షోభకు గురి చేస్తోంది. ఇప్పటికే పలు సర్వేలతో సతమతమవుతున్న సిబ్బందిపై స్వామిత్వ సర్వే భారం మోపింది. ఇందులో సైతం ఓ వింతకు పోయింది. పొలాలు, గృహాలు సర్వే చేయాలంటే సర్వేయర్ తప్పనిసరి. కానీ ప్రభుత్వం చేయిస్తున్న 'స్వామిత్వ' సర్వేలో మాత్రం సర్వేయర్ లేకుండా సర్వే జరిపేస్తోందటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇది విన్న ప్రజలు ఇదేం దిక్కుమాలిన పని..? అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

ఉద్దేశం ఇదీ..

పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమి, ఇళ్లు, పొలాలు, ఆస్తులను కొందరు అనుభవిస్తున్నారు. కానీ వాటికి ఎలాంటి దస్తావేజులు ఉండటం లేదు. కొన్నేళ్ల నుంచి ఎలాంటి దస్తావేజులు, ఆస్తి పత్రాలు లేకుండా అనుభవ పూర్వకంగా వస్తున్న స్థలాలను, ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం 'స్వామిత్వ' సర్వేను తీసుకువచ్చింది. దేశంలో స్వామిత్వ సర్వేను 2020లో చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాలు, పట్టణాల్లో ఈ సర్వేను నిర్వహిస్తున్నారు. సర్వే ద్వారా పూర్వీకుల నుంచి సంక్రమిస్తున్న ఆస్తిని అనుభవిస్తున్న వారికి అధికారిక పత్రాలు లేకపోవడంతో క్రయ విక్రయాలు, పంపకాల సమయంలో సమస్యలు లేకుండా చూడాలన్నది కేంద్రం ఉద్దేశం. సర్వే ద్వారా అలాంటి ఇళ్లు, స్థలాలను గుర్తించి, ఆస్తిని అనుభవిస్తున్న వారికి 'ప్రాపర్టీ కార్డు' జారీ చేయడం 'స్వామిత్వ' లక్ష్యం.





స్వామిత్వ సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

జరుగుతోంది ఇదీ..

అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్న 'స్వామిత్వ' సర్వే.. జిల్లాలో మాత్రం పారదర్శకతకు పాతరేస్తోంది. కేంద్రం ఆదేశాల మేరకు సర్వేను పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్, సర్వే, భూమి రికార్డుల శాఖ కలిసి పూర్తి చేయాల్సి ఉంది. సర్వే అన్ని రాష్ట్రాల్లో ఈ విధంగా నిర్వహిస్తుండగా.. కొన్ని రాష్ట్రాల్లో ప్రైవేటు వ్యక్తులతో చేపడుతున్నారు. రాష్ట్రంలో మాత్రం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో చేయిస్తున్నారు. బాధ్యత ఉన్న సచివాలయ సిబ్బందితో చేయించడం మంచిదే. అయితే క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితి అధ్వానంగా ఉంది. నిబంధనలకు విరుద్ధంగా సర్వే సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే ప్రధానంగా సచివాయంలో ఉన్న గ్రామ సర్వేయర్ నిర్వహించాలి. ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా సాగుతోంది. సర్వే బృందంలో మహిళా పోలీసు, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ ఉద్యోగులు ఉంటున్నారే తప్ప.. బృందంలో కీలక భూమిక పోషించాల్సిన సర్వేయర్ ఉండటం లేదు. వీఆర్ఓ, సర్వేయర్ లేకుండానే భూమి కొలత ఎలా తీసుకుంటారని సచివాలయ ఉద్యోగులను ప్రజలు ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేక నీళ్లు నమలాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ పరిణామం ప్రజల్లో ఆందోళన నింపుతోంది. ఇప్పుడు ఏదో ఒక కొలతలు తీసుకుని వెళితే.. భవిష్యత్తులో గొడవలు తలెత్తే అవకాశం ఉందని, అప్పుడు ఎవరికి చెప్పుకోవాలంటూ ఆందోళన చెందుతున్నారు. అసలు సర్వేయర్ లేకుండా సర్వే చేయడంపై మండిపడుతున్నారు.

సచివాలయ ఇంజినీర్లతో...

భూమి కొలతలు తీసుకున్న అనంతరం వాటికి ఓ మ్యాప్ రూపొందించాలి. సాఫ్ట్‌వేర్‌లో మ్యాప్ ఎలా తయారు చేయాలన్న శిక్షణ గ్రామ సర్వేయర్లకు అప్పట్లో ఇచ్చారు. ఆ బాధ్యతను ఎలాంటి శిక్షణ లేని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పూర్తి చేయాలని ఇప్పుడు ఒత్తిడి తెస్తున్నారు. ఆ సాఫ్ట్‌వేర్ మీద సరైన శిక్షణ లేకుండా తామెలా చేయాలంటూ.. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గగ్గోలు పెట్టడంతో హడావుడిగా ఒక రోజు ఆన్‌లైన్ ట్రైనింగ్ ఇప్పించి పూర్తి చేయాలంటూ ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో చేసేది లేక మండలానికి ఇద్దరు సర్వేయర్లను కేటాయించి, భౌతికంగా ఆస్తుల సరిహద్దులు ఏవీ పరిశీలించకుండానే సాఫ్ట్‌వేర్‌లో మ్యాప్ తయారు చేస్తూ స్వామిత్వ సర్వే చేసేస్తున్నారు. స్థలం ఎవరిది, ఎన్ని రోజులుగా అనుభవంలో ఉంటున్నారు..? అన్న కనీస వివరాలు తెలుసుకోకుండానే మొక్కుబడిగా సర్వే చేసేస్తున్నారు. సర్వేకు సంబంధించిన పత్రాలపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సంతకాలు చేస్తుండటంతో భవిష్యత్తులో తలెత్తే సమస్యలకు తాము బాధ్యత వహించాల్సి ఉంటుందేమో? అని వారు ఆందోళన చెందుతున్నారు.

రీ సర్వేలో సర్వేయర్లు

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 512 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటిలో 3,988 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో సచివాలయానికి ఒక్కో సర్వేయర్ ఉంటారు. జిల్లాలో సుమారుగా 500లకు పైగా సర్వేయర్లు ఉంటారు. వీటిలో సింహభాగం సర్వేయర్లు భూముల రీ సర్వేలో తలమునకలవుతున్నారు. 50 మంది వరకు స్వామిత్వ సర్వేలో భాగస్వామ్యం అవుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం కనీస ఆలోచన లేకుండా ఉన్న ఉద్యోగులతో భూమి కొలతలు తీయించేస్తోంది.

జిల్లాలో ఇలా...

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా తొలి దశలో 99 గ్రామాల్లో సర్వే కొనసాగింది. రెండో దశలో 78 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. సుమారుగా 512 మంది సర్వేయర్లుండగా.. వారిలో సుమారు 50 మంది మాత్రమే స్వామిత్వ సర్వేలో పాల్గొంటున్నట్లు సమాచారం. మిగిలిన వారంతా రెవెన్యూ రీ-సర్వేలో ఉన్నారు. ఫలితంగా ఇప్పటికి కేవలం 40 గ్రామాల్లో మాత్రమే సర్వే నిర్వహించినట్లు సమాచారం.

మా జీవితాలు ఇంతేనా?

- సమగ్ర శిక్షలో చాలీచాలని వేతనాలు
- ఇబ్బందుల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- కనికరించని కూటమి పాలకులు



విద్యార్థికి పాఠాలు బోధిస్తున్న సీఆర్ఎంటీ

రాజమహేంద్రవరం రూరల్: సమగ్ర శిక్ష విద్యాశాఖలో నిరుద్యోగులైన సీఆర్ఎంటీ (క్లస్టరు రిజర్వు మొబైల్ టీచర్స్), పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, మండల లెవెల్ అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను భారంగా నెట్టుకొస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలు, ఇంటి అద్దెలు, ఖర్చులతో దిక్కుతోచని పరిస్థితిలో అల్లాడిపోతున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా జీతాలు పెరగడం లేదని ఆందోళన చెందుతున్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్న సుప్రీంకోర్టు తీర్పును పాలకులు అమలు చేయకపోవడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి...

జిల్లా వ్యాప్తంగా మండల వనరుల కేంద్రాలలో పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు 280 మంది, సీఆర్ఎంటీలు 73మంది, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లు 16 మంది, అకౌంటెంట్లు పదిమంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 15మంది, మెసెంజర్స్ 19 మంది పనిచేస్తున్నారు. వీరంతా 2012లో ఉద్యోగాల్లో చేరారు. అప్పట్లో వీరికి నెలకు రూ.18,500 జీతం అందేది. తర్వాత వచ్చిన పాలకులు జీతాలు విస్మరించగా 2020లో వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రూ.23,500కు వేతనం పెంచారు.

కక్ష కట్టిన కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరునెలల్లోనే కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమమ్ టైంస్కేల్ వర్తింప చేయరాదని 2025 జనవరిలో జీవో నెంబరు-2 విడుదల చేసింది. ప్రభుత్వ శాఖలలో మంజూరైన ఖాళీ పోస్టులలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రమే అర్హులని తెల్పింది. ఈ జీవో రాజ్యాంగం కల్పించిన సమాన హక్కుకు విరుద్ధమని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సరైన వేతన నిబంధనలు అమలు కావడం లేదని వాపోయారు.

అమలు కాని హామీలు..

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చినా అమలు చేయడం లేదని ఇటీవల ఎన్టీఆర్ భరోసా పెన్షన్, నూతన రేషన్‌కార్డులు, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేసినప్పటికీ చిరుద్యోగులకు వర్తింపచేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర ధరలు, రవాణా, వైద్య ఖర్చులు, ఇంటి అద్దె విపరీతంగా పెరగడంతో జీతాలు సరిపోవడం లేదని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు. నెలవారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీతం పెంపుతో పాటు, రిటైర్‌మెంట్ వయసు పెంపు, ఆరోగ్య భద్రత, పిల్లల విద్య, ఇంటి అద్దెభృతి, రేషన్ సబ్సిడీ పథకాలు, పదవీ విరమణ ప్రయోజనాలు వంటివి ప్రత్యేకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.



Lokesh Nara @naralo... · 26 Dec 23

గత ఆరు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వహించడం శోచనీయం. మినిమమ్ టైం స్కేల్ విషయంలో జీవోల మీద జీవోలు ఇచ్చి అమలు చేయకపోవడం, ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించే చర్యలకు పాల్పడటం దారుణం. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు తెలుగుదేశం పార్టీ సంఘీభావం తెలియజేస్తోంది. సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.

#WhyAPHatesJagan

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మద్దతుగా గత ప్రభుత్వంలో లోకేష్ చేసిన ట్వీట్

లోకేష్ సార్..ట్వీట్ మరిచారా...

సమగ్రశిక్ష ఉద్యోగులు గత ప్రభుత్వంలో 2023 డిసెంబర్ నెలలో మినిమమ్ టైంస్కేలు విషయంపై నిరవధిక సమ్మె చేపట్టారు. ఆ సమయంలో ప్రస్తుత రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు టీడీపీ సంఘీభావం తెలియజేస్తోందని, సమగ్రశిక్ష ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన ట్వీట్ చేశారు. నాడు మద్దతు తెలిపి నేడు అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడంలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలు పెంచాలి



జీతాలు పెరగక ఇబ్బందులు పడుతున్నాం. నిత్యావసర ధరలు, రవాణా, వైద్యం, ఇంటి అద్దె వంటి ఖర్చులు విపరీతంగా పెరగడంతో కుటుంబ పోషణ భారమవుతోంది. నెలవారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచాలి.

-కాపరపు లక్ష్మణరేఖ, సీఆర్ఎంటీల మహిళా విభాగ అధ్యక్షురాలు, కొవ్వూరు

ఉద్యోగ భద్రత కల్పించాలి



కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. చాలీచాలనీ జీతాలతో ఇబ్బందులు పడుతున్నాం. ఉపాధ్యాయుల మాదిరిగానే సెలవులు వర్తింపచేయాలి. ఉద్యోగ విరమణ 62 ఏళ్లకు పెంచి ,రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి.

– మెప్పెల్లి రఘునాథ్, సీఆర్ఎంటీల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు, రాజమహేంద్రవరం రూరల్

178 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కీర్తి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అర్హత కలిగిన వారి అర్జీల పరిష్కారం చూపే దిశలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలు ఎటువంటి వ్యయ ప్రయాసలకు లోను కాకుండా ఇంటి వద్దనే ఉండి తమ సెల్‌ఫోన్ల ద్వారా 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తమ అర్జీల స్థితి తెలుసుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ శానిటేషన్ నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉండటంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వాటర్ ట్యాంకుల శుభ్రత, చెత్త నిల్వలు తొలగింపు వంటి చర్యలను పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ లను చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 178 దరఖాస్తులు స్వీకరించారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ చాంబర్ లో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై వైద్య, తదితర శాఖల అధికారులతో సమావేశంలో పాల్గొన్నారు. పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని సూచించారు. లింగ నిష్పత్తి తక్కువగా నమోదైన పీహెచ్‌సీలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, స్టాఫ్ నర్సులు గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. స్కానింగ్ యంత్రాలను చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌ఓ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పి. కోమల, డీసీహెచ్ఎస్ ఎం.పద్మ పాల్గొన్నారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 40 వినతులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌కు 40 అర్జీలు వచ్చాయి. ఎస్పీ డి.నరసింహ కిశోర్ అర్జీదారులతో నేరుగా మాట్లాడారు. సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. సివిల్ కేసులు, కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాట కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓఎన్‌జీసీ పైప్‌లైన్ లీక్



కె.పెదపూడి వంతెన వద్ద లీక్ అవుతున్న గ్యాస్, ఆయిల్

అంబాజీపేట: కె.పెదపూడి–కొత్తపాలెం వంతెన వద్ద ఉన్న అప్పర కౌశిక గట్టుపై సోమవారం ఓఎన్‌జీసీకి చెందిన గ్యాస్ పైప్ లైన్ లీక్ అయింది. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లిన రైతులలో కొంతమంది గ్యాస్, ఆయిల్ లీకేజీ అయిన ప్రాంతంలో ఆయిల్ వాసన రావడంతో ఆయిల్, గ్యాస్ మిళితమైన వాసన వస్తున్నట్టు గమనించారు. తక్షణమే వారు అంబాజీపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దాంతో పోలీసులు ఓఎన్‌జీసీ అధికారులకు లీకేజీ విషయాన్ని తెలియజేశారు. అయినవిల్లి మండలం మడుపల్లి నుంచి మామిడికుదురు మండలం పాశర్లపూడి వెళుతున్న పైపు లైన్ లీకేజీ ప్రాంతాన్ని ఓఎన్‌జీసీ అధికారులు హుటాహుటిన సిబ్బంది సాయంతో చేరుకుని పరిశీలించారు. ఉదయం నుంచి శ్రమించి సాయంత్రానికి గ్యాస్, ఆయిల్ పైప్ లీకేజీని అరికట్టడంతో గ్రామస్తులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఖైదీ పరారీ



బత్తుల ప్రభాకర్ (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వాయిదా కోసం విజయవాడ తీసుకువెళ్లి తిరిగి తీసుకువస్తుండగా బత్తుల ప్రభాకర్ అనే ఖైదీ సోమవారం రాత్రి 7.30గంటలకు దేవరపల్లి మండల దుద్దుకూరు వద్ద పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యాడు. దొంగతనం కేసులో నిందితుడు అయిన ఇతను పారిపోయినప్పుడు ఒక చేతికి హ్యాండ్ కఫ్స్, వైట్ కలర్ టీ షర్ట్, బ్లాక్ కలర్ ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నాడని దేవరపల్లి ఇన్‌స్పెక్టర్ తెలిపారు.పై ముద్దాయి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 94407 96584 (ఇన్‌స్పెక్టర్ దేవరపల్లి), 94407 96624 (సబ్ ఇన్‌స్పెక్టర్ దేవరపల్లి) ఫోన్ నంబర్లకు తెలియజేయాలని కోరారు. ముద్దాయి ఆచూకీ లేదా సమాచారం తెలిపిన వారికి తగిన పారితోషికం ఇస్తామని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



వీరబాబు (ఫైల్)

గోపాలపురం: మండలంలోని కరిచర్లగూడెం గ్రామానికి చెందిన శింగులూరి వీరబాబు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందినట్లు ఎస్సై పి మనోహర్ సోమవారం విలేకరులకు తెలిపారు. కరిచర్లగూడెంలో టిప్‌టాప్ కంపెనీలో లైటింగ్ ఇతర పనులు చేస్తున్న శింగులూరి వీరబాబు మండలంలోని కోమటికుంట గ్రామంలో పుట్టిన రోజు వేడుకల్లో లైటింగ్ పనులకు వెళ్లాడు. అప్పటికే భారీ వర్షం కురవడంతో కాలి కింద వైర్లు తడిసిపోవడం వల్ల షాక్‌కు గురై వీరబాబు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతనిని తోటి కార్మికులు గోపాలపురం సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వీరబాబు మృతితో కరిచర్లగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అతని తండ్రి చనిపోయి నాలుగు సంవత్సరాలు అవుతుంది. తల్లి, తమ్ముడు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోయామని తల్లి, తమ్ముడు రోదిస్తున్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజుకు వేళాయె

- అపరాధ రుసుం లేకుండా అక్టోబర్ 10 తుది గడువు
- ఆలస్యమయ్యే కొద్దీ పెరగనున్న అపరాధ రుసుం
- జిల్లాలో 27,618 మంది ఇంటర్ విద్యార్థులు



రాయవరం: వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి తొలి అడుగు పడింది. పరీక్ష ఫీజు చెల్లింపునకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. అపరాధ రుసుం లేకుండా ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజు చెల్లింపునకు అక్టోబర్ 10వ తేదీ తుది గడువుగా ఇంటర్మీడియెట్ బోర్డు నిర్ణయించింది. 2026 మార్చిలో జరగనున్న ఇంటర్ పరీక్షలకు ఇంటర్మీడియెట్ బోర్డు పరీక్ష ఫీజు ఈ నెల 15వ తేదీ నుంచి చెల్లించే విధంగా ఇంటర్మీడియేట్ బోర్డు కమిషనర్ ఆదేశాలు విడుదల చేశారు. అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఇంటర్ బోర్డు అక్టోబర్ 10వ తేదీ వరకు తొలుత గడువు విధించింది. అక్టోబర్ 11 నుంచి 21వ తేదీ వరకు రూ.1,000 అపరాధ రుసుముతో చెల్లించే అవకాశం ఉంది. అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజును చెల్లించేందుకు విద్యార్థులు అప్రమత్తమవ్వాలని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు సూచిస్తున్నారు.

పరీక్ష ఫీజుల చెల్లింపు ఇలా..

ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ జనరల్/ఒకేషనల్ విద్యార్థులు థియరీ పరీక్ష నిమిత్తం రూ.600 చెల్లించాల్సి ఉంది. జనరల్ కోర్సులు చదివే సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్ (సెకండియర్ విద్యార్థులు మాత్రం) రూ.275 చెల్లించాల్సి ఉంది. ఒకేషనల్ కోర్సు చదువుతూ బ్రిడ్జి కోర్సు చేసే విద్యార్థులు బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు పరీక్ష రుసుంగా రూ.165 చెల్లించాల్సి ఉంటుంది. సెకండియర్ చదువుతూ ఫస్టియర్ సబ్జెక్టులు ఫెయిలైన విద్యార్థులు మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం థియరీ ఫీజు కలిపి రూ.1,200 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సు చదువుతూ ఫస్టియర్, సెకండియర్ ప్రాక్టికల్స్ రాసే విద్యార్థులు రెండేళ్లకు కలిపి రూ.550 చెల్లించాలి. బ్రిడ్జి కోర్సు చదివే విద్యార్థులు రెండేళ్ల పరీక్షలు కడితే రూ.330 చెల్లించాలి.

ఫస్టియర్, సెకండియర్ పాసై ఉండి, మార్కులు ఇంప్రూవ్‌మెంట్‌కు పరీక్ష రాసే ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,350 వంతున, సైన్స్ విద్యార్థులు రూ.1,600 వంతున పరీక్ష ఫీజుగా చెల్లించాలి.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 130 జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 13, ఎయిడెడ్ ఒకటి, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఆరు, హైస్కూల్ ప్లస్ 19, ఒకేషనల్ కళాశాలలు 25, ప్రైవేట్ కళాశాలలు 66 ఉన్నాయి. ఈ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్ 13,750 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. సెకండియర్ విద్యార్థులు 13,868 మంది చదువుతున్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు (ఐపీఈ) రాయాలంటే దరఖాస్తుతో పాటు పరీక్ష ఫీజును తప్పనిసరిగా చెల్లించాలి. జిల్లాలో 27,618 మంది విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంది.

గడువులోగా చెల్లించాలి



పరీక్ష ఫీజును గడువులోగా చెల్లించాలని ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు ఆదేశాలు ఇచ్చాం. పరీక్ష ఫీజు సకాలంలో చెల్లించే విధంగా విద్యార్థులను అప్రమత్తం చేయాలని సూచించాం. గడువు ముగిసిన తర్వాత అపరాధ రుసుంతో చెల్లించాల్సి వస్తుంది.

– వనుము సోమశేఖరరావు, ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నాందీ ఫౌండేషన్‌తో నన్నయ ఎంఓయూ



ఎంఓయూ పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

రాజానగరం: నాందీ ఫౌండేషన్‌తో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. సోమవారం ఇందుకు సంబంధించిన పత్రాలపై వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ఫౌండేషన్ రీజనల్ మేనేజర్ శ్రీలక్ష్మి సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు. ఏపీలో తొలిసారిగా ‘నన్నయ’ వర్సిటీతో నాందీ ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుందని వీసీ తెలిపారు. దీని ద్వారా యూనివర్సిటీ క్యాంపస్‌తోపాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లు, అనుబంధ కళాశాలల్లోని 22 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. నైపుణ్యాభివృద్ధితోపాటు ఉద్యోగావకాశాలకు అవసరమైన శిక్షణను ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న లాయర్లు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): న్యాయవాదుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.ఏ) ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కాకినాడ బార్ అసోసియేషన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ కలెక్టరేట్‌కు వరకూ సాగింది. అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు అసోసియేషన్ నాయకులు డిమాండ్లతో కూడిన వినతి పత్రంను సమర్పించారు. ఈ సందర్భంగా కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డెత్ బెన్ఫిట్ ఫండ్ కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.ఏ) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం, స్టేట్‌బార్ కౌన్సిల్ విఫలమయ్యాయని ఆరోపించారు. అర్హులైన న్యాయవాదులకు రూ.10 లక్షలు ఆరోగ్య బీమా కార్డులు మంజూరు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు రూ.10వేలు చొప్పున ఐదేళ్ల పాటు స్టయిఫండ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఐ.ఎల్.ఏ. జిల్లా ఉపాధ్యక్షుడు కోలా శ్రీహరి రావు మాట్లాడుతూ ప్రభుత్వం నోటరీ న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని, మ్యాచింగ్ గ్రాంటును విడుదల చేయాలన్నారు. ఐఎల్ఏ జిల్లా మహిళా కన్వీనర్ డాక్టర్ వై.వసంతకుమారి మాట్లాడుతూ న్యాయశాఖ ఉద్యోగాలలో మహిళలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు, ఐ.ఎల్.ఏ. జిల్లా నాయకులు పిల్లి శ్రీనివాస్ గౌడ్, మంగం శివరామకృష్ణ, జె.వి.రమణ, ఎం.సరోజిని, బండి నరేంద్ర, నాగభూషణం, పంతగడ అప్పారావు, బి.వి.రమణ, చక్రవర్తి,అశోక్, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అమలుకు కృషి

ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు సూచన



11 జిల్లాలలోని టీఓటీలకు శిక్షణను ప్రారంభించిన ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అమలుకు కృషి చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో టీఓటీలుగా ఎంపిక చేసిన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. టీఓటీలకు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న టీఓటీలు ఆయా మండలాలకు వెళ్లి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుందన్నారు. 11 జిల్లాలో 300 మందికి శిక్షణ ఇవ్వవలసి ఉండగా ఆరవ బ్యాచ్‌తో శిక్షణ పూర్తి అవుతుందని చెప్పారు. ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో పేదరికం లేని గ్రామాలు, ఆకలి నిర్మూలన, మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రతీ గ్రామంలో అమలు జరిగే విధంగా చూడాలన్నారు. గ్రామాలల్లో ప్రజలందరిని ఆరోగ్యంగా ఉంచటం ద్వారా మంచి గ్రామాన్ని తయారు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు ప్రజల్లో పోషకాహార లోపాలను గుర్తించడం, కౌమార దశలో ఉన్న బాలికలు, స్త్రీలలో రక్తహీనతను తొలగించడం, తక్కువ బరువు కలిగిన పిల్లలను గుర్తించవలసి ఉంటుందన్నారు. ఈ మేరకు ఈ పనులను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చేయవలసి ఉంటుందని చెప్పారు. స్థానికంగా సేకరించిన తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. అంటు వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మాతాశిశు మరణాలు లేకుండా చేయాలని సూచించారు. ఈ మేరకు హెల్త్ సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన, పోషకమైన మధ్యాహ్న భోజనం అందించే విధంగా చూడాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ ఆయుష్ మిషన్, ఐసీడీఎస్ అనుబంధ పథకాలు, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, పోషణ్ అభియాన్‌లు పంచాయతీ స్థాయిలో వినియోగించుకోవాలని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ ఫ్యాకల్టీలు డి.శ్రీనివాసరావు, కె.సుశీల, ఎస్ఎస్ శర్మ, ఎం. చక్రపాణిరావు, కేఆర్ నిహారిక, పి.రామకృష్ణ, వి.జగన్నాథం, ఎం.రాజేకుమార్ శిక్షణ నిర్వహించారు.

25న డీఎస్సీ సెలక్టెడ్ టీచర్లకు సమావేశం

రాయవరం: డీఎస్సీ–2025 సెలక్టెడ్ ఉపాధ్యాయులకు ఈ నెల 25న అమరావతిలో సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా సోమవారం తెలిపారు. సెలక్టెడ్ ఉపాధ్యాయులు ఈ నెల 24న రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారికి రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. అక్కడ నుంచి ఈ నెల 25 ఉదయం విజయవాడకు బస్సుల్లో వెళ్తారని, మార్గమధ్యంలో భీమడోలులో లంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డీఎస్సీ సెలక్టెడ్ అభ్యర్థులందరూ ఈ విషయాన్ని గమనించి, ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరు కావాలని డీఈవో బాషా తెలిపారు.

ముగిసిన సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు



కాకినాడ జిల్లా సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా సీనియర్ పురుష, మహిళల జట్ల ఎంపిక ప్రక్రియ ముగిసింది. చొల్లంగి జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన ఎంపికలకు కాకినాడ జిల్లా నుంచి 40 మంది పురుషులు, 30 మంది మహిళలు పాల్గొన్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, కార్యనిర్వాహక కార్యదర్శి వి.నీలిమ, సీనియర్ వ్యాయామోపాధ్యాయులు ధనలక్ష్మీ కుమారిల సమక్షంలో జరిగిన ఈ పోటీలలో ప్రతిభ కనబరచిన 8 మంది పురుషులు, 8 మంది మహిళలను కాకినాడ జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. పురుషుల జట్టులో లివేష్, వినయ్, కేఎస్ నారాయణ, రాజేంద్రప్రసాద్, సాత్విక్, బద్రీష్, తేజ, సన్నీ, మహిళల జట్టుకు మానవి, మానస, తేజస్వి, శాన్వి, దివ్యజ్యోతి, బ్లెస్సీ, పద్మ, బిఎస్ఎస్ లక్ష్మిఐశ్వర్య ఎంపికైనట్లు నీలిమ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జట్ల ఎంపిక



జి.మామిడాడలో క్రీడా ఎంపికల్లో బాస్కెట్‌బాల్ ఆడుతున్న బాలికలు



జి.మామిడాడలో క్రీడా ఎంపికల్లో వాలీబాల్ ఆడుతున్న బాలురు

పెదపూడి: రాష్ట్ర స్థాయిలో జరిగే అండర్–19 బాస్కెట్ బాల్, బాలీబాల్, బాడ్మింటన్ పోటీలకు బాలురు, బాలికల విభాగాల్లో జట్లు ఎంపిక చేశామని ఆర్గనైజింగ్ సెక్రటరీ పడాల గంగాధర్‌రెడ్డి అన్నారు. జి.మామిడాడ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్‌జీఎఫ్ అండర్–19 ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడా ఎంపికలు పాఠశాల హెచ్‌ఎం అప్పలచారి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమాన్ని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జుత్తుగ సూర్యకుమారి, కాకినాడ డివిజనల్ ఆత్మ కమిటీ చైర్మన్ రావాడ నాగు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఎంపికల్లో సుమారు 400 బాలురు, బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పూర్వ క్రీడాకారుల సంఘం అధ్యక్షుడు సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి, ఇల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి, రామచంద్రపురం ఎంఈఓ తాడి వీర రాఘవరెడ్డి, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్షుడు లంక జార్జ్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ సుధ, పూర్వ క్రీడాకారులు మల్లిడి శ్రీనివాసరెడ్డి, రామలక్ష్మణులు పాఠశాల పిడి నల్లమిల్లి అప్పారెడ్డి, దీప్తి ఎస్తేర్, యువరాజారెడ్డి, బులిగంగిరెడ్డి, గౌరీ శంకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రూ. 5.13 లక్షలకు సోషల్ మీడియా మిత్రుడి టోపీ

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలోని ఇద్దరు స్నేహితులను సోషల్ మీడియా ద్వారా పరిచయం అయిన మిత్రుడు రూ.5,13,999 టోపీ పెట్టినట్టు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ సోమవారం తెలిపారు. పందలపాక గ్రామానికి చెంది ప్రస్తుతం బిక్కవోలు నివాసం ఉంటున్న నూలు దుర్గాప్రసాద్, బొమ్మకంటి శేఖర్ కుమార్‌లు స్నేహితులు. వీరికి 2022లో సోషల్ మీడియాలో బత్తుల సాయి రమేష్ అనే వ్యక్తి మార్కెట్ మినిస్టర్ పబ్లిక్ గ్రూప్ ద్వారా పరిచయం అయ్యాడు. అతను ఆ గ్రూప్ అడ్మిన్‌గా ఉన్నాడు. తాను కంటి డాక్టర్‌ను అని పరిచయం చేసుకున్నాడు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ట్రేడింగ్ చేయమని ప్రోత్సహిస్తూ, టిప్స్ ఇస్తూ వారిని నమ్మించాడు. అనంతరం ట్రేడింగ్ కోసం కాపిటల్ పెట్టమని ఒత్తిడి చేసి, తన ఫోన్ నంబర్ 9966614860 కు 13-1-2024 నుంచి 15-05-2024 వరకు మధ్య దశల వారీగా రూ.5,13.999 వేయించుకున్నాడు . లాభాలు ఇస్తానని నమ్మించాడు. తరువాత అతనికి ఫోన్ చేసినప్పుడు స్పందించకపోవడంతో తాము మోసపోయామని గ్రహించారు. దీంతో ఈ నెల 8 తేదీన జిల్లా ఎస్పీకి పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఈ రోజు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు.

అత్తింటి వేధింపులు తాళలేక

చీమలమందు తాగిన వివాహిత

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితురాలి తమ్ముడు



రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న లోవనాగమణి

రాజమహేంద్రవరం రూరల్: భర్త, బావ, అత్త వేధింపులు తాళలేక శాటిలైట్‌సిటీ గ్రామానికి చెందిన యడవల్లి లోవనాగమణి చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధిత బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 17ఏళ్ల క్రితం విశాఖపట్నం గోపాలపట్నం ప్రాంతానికి చెందిన లోవనాగమణిని శాటిలైట్‌సిటీకి చెందిన యడవల్లి సతీష్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు అబ్బాయిలు. ఏడాది క్రితం వరకు ముగ్గురు పిల్లలతో భార్యాభర్తలు సంతోషంగా ఉన్నారు. గత ఏడాది డిసెంబర్ 24వతేదీన యడవల్లి సతీష్‌కుమార్ అన్న వెంకటేశ్వరరావు లోవనాగమణితో తప్పుగా ప్రవర్తించడంతో బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే కుటుంబ పెద్దల సూచనతో ఆరోజు రాజీ చేసుకున్నారు. శాటిలైట్‌సిటీలో ఉంటూ యడవల్లి లోవనాగమణిపై నర్సీపట్నం కోర్టులో నాగమణి కాపురానికి రాకుండా పుట్టింటి వద్ద ఉంటోందని అతని భర్త సతీష్‌కుమార్‌తో బావ వెంకటేశ్వరరావు కేసు వేయించారు. ఆ కేసుకు కౌంటర్‌గా నాగమణి సైతం కేసు ఫైల్ చేసింది. దీంతో చేసేదిలేక సతీష్‌కుమార్, అతని అన్న వెంకటేశ్వరరావు ప్రోద్బలంతో ఇంటిలో ఉంటున్న లోవనాగమణిని తరుచూ కొట్టడంతో బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. విశాఖ గోపాలపట్నంలో తండ్రికి అనారోగ్యం చేయడంతో ఇంటికి తాళం వేసి, తాళం అత్తకు ఇచ్చి వెళ్లింది. రెండురోజుల తరువాత తిరిగి వచ్చేసరికి ఇంటిలోని బీరువా, ఫ్రిజ్, మంచం, ఇంటి డాక్యుమెంట్స్ తదితర వస్తువులు తీసుకుని వెళ్లిపోయారు. విశాఖ నుంచి తిరిగి ఇంటికి వచ్చిన నాగమణి ఇంటిలో ఉండాల్సిన వస్తువులు లేకపోవడంతో అత్తను అడుగుగా దుర్భాషలాడారు. దీంతో మనస్తాపం చెందిన లోవనాగమణి ఈ నెల 18వ తేదీన చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ఇది గమనించిన స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి విశాఖలోని ఆమె తల్లి మిరియాల అన్నపూర్ణకు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో ఉన్న లోవనాగమణి ప్రస్తుతం కోలుకుంది. లోవనాగమణి సోదరుడు భాను ప్రకాష్ తన సోదరి ఆత్మహత్యాయత్నానికి కారకులైన ఆమె భర్త, బావ, అత్తలపై చర్యలు తీసుకోవాలని అవుట్ పోస్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. లోవనాగమణి తల్లి మిరియాల అన్నపూర్ణ తన కుమార్తెను ఆమె భర్త, బావ, అత్తల నుంచి కాపాడాలని, భార్యాభర్తలు ఇద్దరు కలిసి ఉండేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియాలో ఒక వీడియో ద్వారా వేడుకోంది.


గంధం చెట్ల దొంగలు దొరికారు



గంధం దొంగలతో పోలీసులు

రాజానగరం: మండలంలోని నందరాడలో గంధం చెట్లను దొంగిలించినవారిని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన స్థానిక సీఐ వీరయ్యగౌడ్ సోమవారం ఇక్కడ మీడియాకు తెలిపిన వివరాలిలావున్నాయి. నందరాడలో ఒక రైతుకు చెందిన 12 ఎకరాల తోటలో కొబ్బరి, మామిడి, టేకు, ఎర్రచందనంతోపాటు గంధం చెట్లు కూడా ఉన్నాయి. వీటిలో రెండు గంధం చెట్లను ఈ నెల 16న గుర్తు తెలియని వ్యక్తులు మొదళ్ల వరకు నరికి తీసుకుపోయారు. ఈ మేరకు ఆ తోట కాపలాదారు దొడ్డా సోమేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన రాజానగరం పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కట్ని జిల్లా సుగవాస్‌కు చెందిన జులిస్ ఆదివాసీ, శివరాజ్ ఆదివాసీ, ఉల్లిస్‌లను నిందితులుగా గుర్తించి, దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద అరెస్టు చేశారు. వారి నుంచి 53 గంధం ముక్కలను, చెట్టు నరకడానికి ఉపయోగించిన పరికరాలను స్వాధీన పర్చుకున్నారు. దొంగిలించిన రెండు గంధం చెట్ల విలువ రూ.3.50 లక్షలకు పైనే ఉంటుందన్నారు. గతంలో కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో జరిగిన గంధం చెట్ల చోరీ కేసులో శివరాజ్ ఆదివాసీ నిందితునిగా ఉన్నాడు. ఇది ఒక ముఠా అని, ఇందులో ఉన్న సభ్యులంతా ఒక కుటుంబం మాదిరిగా గ్రామ శివార్లలో గుడారాలు వేసుకుని, రుద్రాక్షలు, కాశీ తాళ్లు, గవ్వలు అమ్ముతూ సంచరిస్తుంటారన్నారు. ఆయా ప్రాంతాలలో ఉండే గంధం చెట్లను టార్గెట్‌గా చేసుకుని వీరి సంచార జీవితం నడుస్తుందన్నారు. వీరిని గైడ్ చేసేది మాత్రం కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌కి చెందిన రాజా అని పేర్కొన్నారు. ఇతనిపై కూడా ఏలూరు పోలీసు స్టేషనులో కేసులున్నాయని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై ఎస్.ప్రియకుమార్, హెడ్ కానిస్టేబుల్ పి.అమ్మిరాజు, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, కరీమ్, వెంకటరమణ, నాగేశ్వరరావు, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిడదవోలు : పట్టణంలో ఎన్టీఆర్ కాలనీలో సుమారు 40 ఏళ్లు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. తుప్పల్లో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బార్ తొలగించాలని ఆందోళన



సుబ్బరాజుపేటలో చైతన్య బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

నిడదవోలు: పట్టణంలో సుబ్బరాజుపేట దళితుల ఏరియాలో ఇటీవల ఏర్పాటు చేసిన చైతన్య బార్ అండ్ రెస్టారెంట్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ బార్ వద్ద సోమవారం మహిళలు ఆందోళన చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో దళిత వాడల్లో బార్‌ను ఏర్పాటు చేసి దళితుల జీవితాలను నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వెనుకబడ్డ స్లమ్ ఏరియాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన ప్రభుత్వం ఇంటి వద్దకే మద్యం అన్న చందంగా బార్‌లు ఏర్పాటు చేస్తోందన్నారు. కాసులకు కక్కుర్తి పడి బార్ రెస్టారెంట్ ఏర్పాటుకు స్థలాన్ని లీజుకు ఇచ్చిన యజమాని రాజును మహిళలు నిలదీశారు. తక్షణమే లీజు ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. చైతన్య బార్ – రెస్టారెంట్ ఫ్లెక్సీని చింపివేశారు. కౌన్సిలర్ పిట్టా పద్మావతి మాట్లాడుతూ ఇక్కడ మద్యం దుకాణాలు, బార్లు ఏర్పాటు చేయడంతో మహిళలు, పిల్లలు చాలా ఇబ్బందులు పడతారన్నారు. ఇక్కడ బార్ తీయకపోతే మహిళలంతా ఏకమై బార్‌ను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు దిరిసిన రామచంద్రరావు, సుబ్బారావు, రామలక్ష్మి, సత్తెమ్మ పాల్గొన్నారు.